'విజయవంతం చేయాలి'

జగిత్యాల, ఆగస్టు 10: హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గల బాబూ జగ్జీవన్ రామ్ భవన్‌లో రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు డా.పిడమర్తి రవి అధ్యక్షతన ఆదివారం రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు మాదిగ జేఏసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మెడపట్ల దుబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మాదిగ కులస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎల్వోసీ అందజేత

కొడిమ్యాల, ఆగస్టు 10: తిప్పాయిపల్లి గ్రామానికి చెందిన శ్రీపతి మానస అనారోగ్యంతో బాధపడుతుండగా, శస్త్ర చికిత్స కోసం ఆర్థిక సాయం మంజూరు చేయించాలని స్థానిక నాయకులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే రూ. 2 లక్షల ఎల్వోసీ మంజూరు చేయించారు. ఎల్వోసీ మంజూరు పత్రాన్ని శనివారం మానస కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకుడు మ్యాకల మల్లేశం, తదితరులున్నారు.

పోస్టాఫీసుల్లో జాతీయ జెండాల విక్రయాలు

సబ్ పోస్టాఫీసులో జాతీయ జెండాను కొనుగోలు చేస్తున్న బీఆర్ఎస్‌వై నేత శ్రీనివాస్, తదితరులు

మారుతీనగర్, ఆగస్టు 10: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పోస్టల్ శాఖ జాతీయ జెండాలను ఆన్‌లైన్‌లో విక్రయించేందుకు వెబ్‌సైట్ www.epostoffice.gov.inను రూపొందించింది. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వినియోగదారుల ఇంటికే నేరుగా పంపిస్తున్నది. 'హర్‌ఘర్ తిరంగా-3' పేరిట అన్ని పోస్టాఫీసుల్లో జాతీయ జెండాలను విక్రయిస్తున్నది. పోస్టాఫీసు కార్యాలయాల్లో రూ.25 చెల్లించి 20 x30 సైజు గల జాతీయ జెండా కొనుగోలు చేసుకోవాలని తపాలా అధికారులు వివరిస్తున్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఈనెల 14 వరకు జాతీయ జెండాలను విక్రయిస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

14న బహిరంగ వేలం

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 10: పెద్దాపూర్ గురుకులంలోని పాత వస్తువుల విక్రయానికి ఈనెల 14న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పాత ఇనుము, ఇత్తడి, అల్యూమినియం, స్టీల్, ప్లాస్టిక్ తదితర వస్తువులకు బహిరంగ వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు నిర్దేశిత సమయానికి అరగంట ముందే రూ. రెండువేల ధరావతు చెల్లించాలని తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల, ఆగస్టు 10: పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఉస్మానియా యూనివర్సిటీ ఇటీవల విడుదల చేసిన పీజీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు. ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ విభాగంలో చింతకింది హర్షిని రాష్ట్ర స్థాయిలో 58వ ర్యాంక్, ఎంఏ లింగ్విస్టిక్స్ విభాగంలో సంకోజి అనిల్ 132వ ర్యాంక్, ఎంఎస్సీ డాటా సైన్స్‌లో వల్లెం మాధురి 154వ ర్యాంకు, మేడిపల్లి పూజిత 248, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ విభాగంలో బొమ్మన కార్తీక్ 195, యాసోజి రచన 258, ఎనుగందుల అనుప్రియ 301, శివరాత్రి శ్రీకాంత్ 314, మేడారపు అభిషేక్ 320వ ర్యాంక్ సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ యాద రామకృష్ణ, డైరెక్టర్లు గాడిపెల్లి హరిప్రియ అంజయ్య గౌడ్, ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు అభినందించారు.

సారంగాపూర్, ఆగస్టు 10: రేచపల్లికి చెందిన బాస గంగోత్రి బాటనీ విభాగంలో 14వ ర్యాంక్ సాధించింది. గంగోత్రిని మాజీ జడ్పీటీసీ భుక్యా సరళ, నాయకులు ఎండీ ఇబ్రహీం, ప్రసాద్ గౌడ్, తిరుపతి రెడ్డి, ఆనందరెడ్డి, మహేశ్ అభినందించారు.

జగిత్యాల టౌన్, ఆగస్టు 10: జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కరీంనగర్‌లోని ఎస్సారార్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, హైదరాబాద్‌లోని రాజాబహదూర్ వెంకటరామిరెడ్డి మహిళా కళాశాల, లక్షెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం సంయుక్తంగా నిర్వహించిన ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ద్వారా శిక్షణ పొందిన సుమారు 30 మంది విద్యార్థులు పీజీ (వృక్ష శాస్త్రం) ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మంచి ర్యాంక్‌లు సాధించినట్లు సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్‌రెడ్డి తెలిపారు. ఆన్‌లైన్ కోచింగ్‌కు కన్వీనర్‌గా డాక్టర్ తిరుపతి వ్యవహరించినట్లు వారు తెలిపారు.

విప్‌ను కలిసిన వేదపండితులు

ధర్మపురి, ఆగస్టు 10: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పెళ్లి రోజు సందర్భంగా శనివారం ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయ వేదపండితులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. వేదపండితులు మంత్రోచ్చరణలతో ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు విప్ అడ్లూరి పేరిట లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం, అనుబంధ ఆలయాల్లో స్వామి వారలకు అభిషేకం, సంకల్పాది పూజలు నిర్వహించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో విప్‌ను కలిసి స్వామి వారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్ శర్మ పాల్గొన్నారు.

గ్రామాల్లో వసతుల కల్పనకు ప్రాధాన్యం

- ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

బతికపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్, ప్రజాప్రతినిధులు, నాయకులు

పెగడపల్లి, ఆగస్టు 10: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిచ్చి, పనులు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ఆయన వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం 16 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, 338 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అంతకుముందు బతికపల్లిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ, గ్రామాల్లో రోడ్లు, తాగు నీటి సరఫరాతో పాటు ఇతర సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, డీటీ రాజశేఖర్, ఏఈ శంషేర్‌అలీ, ఆర్ఐ శ్రీనివాస్, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు, నాయకులు శోభారాణి, రాములుగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, తిరుపతి, ప్రభాకర్‌రెడ్డి, స్వామి, ప్రశాంత్, మహేందర్, కిషన్, రాజు, రాకేశ్‌గౌడ్, భాస్కర్, వంశీ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సు కోసమే జంతు సంరక్షణ కేంద్రం



జగిత్యాల రూరల్: రైతులకు పంట రుణాలకు సంబంధించిన చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల, ఆగస్టు 10: పట్టణ ప్రజల శ్రేయస్సు కోసము జంతు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ తెలిపారు. టీఆర్‌నగర్‌లో పట్టణ ప్రగతి నిధులు రూ.35 లక్షలతో ఏర్పాటు చేసిన జంతు సంరక్షణ కేంద్రాన్ని శనివారం ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ కోసం జంతు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేశామని, ప్రతి రోజూ 16 కుక్కలకు శస్త్ర చికిత్స చేస్తారని చెప్పారు. టీఆర్‌నగర్‌లో 150 మందికి డబుల్ బెడ్రూం ఇండ్లను పంపిణీ చేశామని, మరి కొంత మందికి వచ్చేలా చూస్తామని, 116 మందికి ఇండ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం నూకపల్లిలో సరస్వతి గుట్టపై డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారుల కోసం రూ.14 కోట్లతో నిర్మిస్తున్న మంచినీటి ట్యాంక్, పైప్‌లైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ నరేశ్, కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్లు దేవేందర్ నాయక్, చాంద్‌పాషా, డీఈ యాదగిరి, ఏవో శ్రీనివాస్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

జగిత్యాల రూరల్, ఆగస్టు 10: నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల పీఏసీఎస్ పరిధిలో రుణమాఫీ పొందిన 248 మంది రైతులకు రూ. 1.56 కోట్ల విలువైన కొత్త రుణాలకు సంబంధించిన చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈనెల 15న రూ. 2 లక్షల పంట రుణమాఫీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు పత్తిరెడ్డి మైపాల్ రెడ్డి, సందీప్ రావు, సీఈవో వేణు, డైరెక్టర్లు లింగన్న, శంకరయ్య, పోచమల్లయ్య, రాజిరెడ్డి, దేవమ్మ, రాజన్న, గంగారాజు, గంగారం, లక్ష్మి, నాయకులు క్యాదాసు నాగయ్య, బోనగిరి నారాయణ, అంకం సతీశ్, బొడ్డు దామోదర్, పడిగెల స్వామి, ఆంజనేయులు, మహేశ్, శ్రీనివాస్, కోటేశ్వర్ రావు, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

శారద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

గొల్లపల్లి, ఆగస్టు 10: శ్రీరాములపల్లి మాజీ సర్పంచ్ గంగారెడ్డి భార్య జలజ అనారోగ్యంతో బాధపడుతుండగా, వెంగళాపూర్ మాజీ ఉపసర్పంచ్ ఎడమల మల్లా రెడ్డి ఇటీవల శస్త్రచికిత్స చేయించుకోగా వారిని శనివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. అలాగే, రాపల్లి బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు కోల రాములు భార్య శారద, ఇప్రాజ్‌పల్లికి చెందిన బోయిని ప్రకాశ్, దమ్మన్నపేటకు చెందిన బొలిశెట్టి ప్రభాకర్ ఇటీల మృతి చెందగా, బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట చెందోలి ప్యాక్స్ అధ్యక్షుడు వెంకటమాధవ రావు, మాజీ ప్రజాప్రతినిధులు జలందర్, శంకరయ్య, గంగా రెడ్డి, శ్యాం తదితరులున్నారు.

విద్యార్థులకు ఎమ్మెల్సీ అభినందన

జగిత్యాల, ఆగస్టు 10: జిల్లా కేంద్రంలోని ఎన్ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి కొండ బత్తిని సాత్విక కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాలలో జువాలజీ విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. జంగిలి పావని స్టాటిస్టిక్స్ విభాగంలో స్టేట్ 19వ ర్యాంక్, ఏడుగురు విద్యార్థులు వెయ్యిలోపు ర్యాంకులు సాధించారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అభినందించారు. రామకృష్ణ, ఎన్ఎస్వీ విద్యా సంస్థల చైర్మన్ రామకృష్ణ, అకాడమిక్ డైరెక్టర్ శ్రీపాద నరేశ్, ప్రిన్సిపాల్ మునీందర్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన హైకోర్టు సహాయ న్యాయవాది

జగిత్యాల రూరల్, ఆగస్టు 10: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన కొలుగూరి శాంతన్ రావు హైకోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా నియామకమయ్యారు. కాగా, తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను శనివారం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

సారంగాపూర్, ఆగస్టు 10: బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన కొడిమ్యాల జగదాంబ ఇటీవల మృతి చెందింది. బాధిత కుటుంబానికి గౌడ సంఘం ఆధ్వర్యంలో శనివారం రూ. 5 వేల నగదు అందజేశారు. గౌడ సంఘం యూత్ అధ్యక్షుడు బైరవేని సత్యనారాయణ, సభ్యులు సతీశ్, గణేశ్, శ్రీను, రాజు, శేఖర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న శ్రావణ సప్తాహ ఉత్సవాలు

ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మల్యాల, ఆగస్టు 10: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో శ్రావణ సప్తాహ ఉత్సవాలను శనివారం ఆలయ అధికారులు, అనువంశీక అర్చకులు అంతరంగికంగా నిర్వహించారు. శ్రావణ శుద్ధ షష్ఠి సందర్భంగా ఆంజనేయస్వామికి చందనాభిషేకం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే, స్వామి వారి సన్నిధిలో బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రతీపటేల్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు కఫీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, ఉపప్రధాన అర్చకుడు చిరంజీవ స్వామి, వేదపండితులు పెద్దన్న శర్మ, రాజేశ్వర్‌శర్మ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

మెట్‌పల్లి, ఆగస్టు 10: పట్టణంలోని చావిడి వద్ద సైనిక్ ఫౌండేషన్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 30 నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాస చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు అరిగెల రాకేశ్, నాయకులు మర్రి సహదేవ్, పిప్పెర రాజేశ్, బొడ్ల రమేశ్, వడ్లపల్లి శ్రీనివాస్, సుఖేందర్‌గౌడ్, హన్మాండ్లు పాల్గొన్నారు.

సామూహిక చాలీసా పారాయణం

మారుతీనగర్, ఆగస్టు 10: మెట్‌పల్లి పట్టణంలోని హనుమాన్ ఆలయాల్లో శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. హనుమాన్ దీక్షాపరులు, ఆలయ కమిటీ సభ్యులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

నర్సన్న సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, ఆగస్టు 10: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. శ్రావణ మాసంతో పాటు శనివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి క్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మొదట గోదావరి నదిలో స్నానాలాచరించి సంకల్పాది పూజలు జరిపించుకున్నారు. అనంతరం ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో స్వామివారలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఈవో శ్రీనివాస్ పర్యవేక్షణలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

విప్‌ను కలిసిన పంచాయతీరాజ్ ఉద్యోగులు

ధర్మపురి, ఆగస్టు 10: ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను పంచాయతీరాజ్ ఉద్యోగులు శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఉద్యోగ భద్రత, వేతనాలతో పాటు ఉద్యోగ పరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గొట్టె రమేశ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సంతోష్‌కుమార్, శివలాల్, శ్రీనివాస్, నితీశ్, రవితేజ, కృష్ణ, జనార్దన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జగిత్యాల రూరల్, ఆగస్టు 10: బాలపల్లి గ్రామానికి చెందిన కారోబార్ వెన్నెల విష్ణువర్ధన్ తల్లి లలిత అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు, తదితరులున్నారు.

రాయితీపై అద్దెకు ఆర్టీసీ బస్సులు

కోరుట్ల, ఆగస్టు 10: పెళ్లిళ్లు, శుభకార్యాలు, విహారయాత్రలకు వెళ్లే వారి కోసం డిపాజిట్ లేకుండా 10 శాతం రాయితీతో ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇవ్వనున్నట్లు ఆర్టీసీ కోరుట్ల డిపో మేనేజర్ మనోహర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు డిపో మేనేజర్ సెల్ నంబర్ 99592 25928, ట్రాఫిక్ సూపరింటెండెంట్ 7382850611, కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ నంబర్ 91542 98572లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కోరుట్ల, ఆగస్టు 10: పట్టణంలోని ఏస్కోనిగుట్ట అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, తిరుమల గంగాధర్, కౌన్సిలర్ ఉమాదేవి-ప్రభాకర్, భక్తులు ఉన్నారు.

వీధి కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 10: రామలచ్చక్కపేట గ్రామంలో ఇంటిముందు ఆడుకుంటున్న నిహాన్స్ అనే చిన్నారిపై వీధికుక్క దాడి చేయగా, గాయాలయ్యాయి. విట్టంపేట గ్రామంలో రాజు అనే మహిళపై దాడి చేయగా గాయాలయ్యాయి. ఇద్దరిని చికిత్స కోసం మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించకపోవడం దురదృష్టకరం

జగిత్యాల, ఆగస్టు 10: జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించకపోవడం దురదృష్టకరమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట తమకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని జర్నలిస్టులు చేపట్టిన దీక్షకు శనివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో పాటు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, నాయకులు హరి చరణ్ రావు, లోక బాపు రెడ్డి, గోస్కుల జలేందర్, గాదె మాధవరావు సంఘీభావం తెలిపారు. దీక్షకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసపట్ల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ అనుముల్ల జయశ్రీరఘు, గుంటి గంగారం, రాపర్తి రవి, సామల్ల సతీశ్, రామచందర్, స్వర్ణకార సంఘం, బులియన్ మర్చంట్ అసోసియేషన్ నాయకులు గన్నేరువరం బుచ్చయ్య, ముమ్మడి నాగభూషణం, సింహరాజు శేఖర్, తుమ్మనపల్లి గంగాధర్, కత్రోజు గిరి, ప్రవీణ్, రమేశ్, భాస్కర్, వెంకటేశ్వర్లు మద్దతు ప్రకటించారు. పీఆర్‌టీయూ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఆనందరావు, వేణుగోపాలరావు, మల్లారెడ్డి, టీపీటీఎఫ్ నాయకుడు యాద రామకృష్ణ దీక్షలో పాల్గొన్న జర్నలిస్టులకు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. దీక్షలో చీటి శ్రీనివాస్ రావు, మోరపల్లి ప్రదీప్, కమలాకర్ రెడ్డి, కొత్తూరి మహేశ్ కుమార్, మధుసూదన్, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తపాలా సేవలను వినియోగించుకోవాలి

మల్లాపూర్, ఆగస్టు 10: తపాలా శాఖ సేవలను గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ షఫీయొద్దీన్ కోరారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం తపాలా శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్రాంచి పోస్టుమాస్టర్లు రాజేశం, వెంకటరమణ, రమణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పోస్టు కార్డు ఉద్యమం

కోరుట్ల, ఆగస్టు 10: పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు శనివారం పోస్టుకార్డుల ఉద్యమం చేశారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని పోస్ట్ కార్డు ద్వారా విన్నవించారు.

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

కోరుట్ల, ఆగస్టు 10: పట్టణంలోని సీ ప్రభాకర్ భవనంలో టీఎస్ యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు అంబటి భూమేశ్వర్, కొండ్ర అనిల్, శ్రీనివాస్, మధుసూదన్, మాసం చిరంజీవి, జగన్ నాయక్, చెన్న రాజశేఖర్, ప్రవీణ్‌కుమార్, శివకోటి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కోరుట్ల రూరల్, ఆగస్టు 10: భీమునిదుబ్బ ప్రాంతానికి చెందిన పోతుగంటి గౌతమ్, పోతుగంటి లింబాద్రిగౌడ్, తోడేటి గంగారాజంగౌడ్‌తో పాటు కోటగిరి నాగభూషణం తల్లి ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాలను శనివారం కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకుడు తిరుమల గంగాధర్, తదితరులున్నారు.

చెరువులో స్తంభంపై ఇన్సులేటర్ బిగింపు

- ఆర్టిజన్ కార్మికుడి సాహసం

స్తంభంపై ఇన్సులేటర్‌ను అమర్చుతున్న జగన్

కోరుట్ల రూరల్, ఆగస్టు 10: మండలంలోని కల్లూరు గ్రామ శివారులో స్తంభంపై 11 కేవీ ఇన్సులేటర్ పగిలిపోవడంతో వ్యవసాయ మోటార్లకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కాగా, స్తంభం ఊరకుంట చెరువు మధ్యలో ఉంది. దీంతో స్తంభం వద్దకు వెళ్లేందుకు విద్యుత్ లైన్‌మెన్లు, సిబ్బంది సాహసించలేదు. కానీ, పైడిమడుగు సబ్‌స్టేషన్‌లో పనిచేసే ఆర్టిజన్ కార్మికుడు దువ్వాక జగన్ నడుముకు పరికరాలు కట్టుకొని చెరువులో ఈదుకుంటూ స్తంభం వరకు వెళ్లాడు. స్తంభంపైకి ఎక్కి 11 కేవీ ఇన్సులేటర్‌ను అమర్చాడు. అనంతరం వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. జగన్‌ను గ్రామస్తులతో పాటు విద్యుత్ అధికారులు అభినందించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

కోరుట్ల, ఆగస్టు 10: జిల్లాలోని పలు ప్రాంతాల్లో బైక్‌లు, షాపుల్లో దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న ఇద్దరిని కోరుట్ల పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పట్టణంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సురేశ్ బాబు వివరాలు వెల్లడించారు. జగిత్యాల మండలం పొలాస గ్రామానికి చెందిన హర్షద్, అతని అల్లుడు (మైనర్)తో కలిసి జిల్లాలోని పలు ప్రాంతాల్లో దొంగతనాలు చేస్తున్నాడు. వీరిపై గతంలో జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో 3, జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో 7, మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదైంది. కోరుట్లలో ఈనెల 5న ఇద్దరు కలిసి ఓ బైక్ చోరీ, మార్కెట్ సమీపంలోని ఓ కిరాణా షాపులో దొంగతనం చేసినట్లు తెలిపారు. పట్టణ శివారులో శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై వెళ్తున్న నిందితులను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి బైక్, రూ. 27 వేల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ కిరణ్‌కుమార్, కానిస్టేబుళ్లు విజయ్, ఎల్లయ్య, సత్తయ్య, సాగర్, శ్రీనివాస్‌ను ఎస్సీ అశోక్‌కుమార్, సీఐ అభినందించారు.

విద్యా సంస్థల సందర్శన

జగిత్యాల రూరల్, ఆగస్టు 10: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌లోని మహిళా డిగ్రీ కళాశాల, పోలాసలోని బీసీ హాస్టల్, కండ్లపల్లిలోని మోడల్ స్కూల్‌ను కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు శనివారం ఎంపీవో రవిబాబు సందర్శించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వసతి గృహాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అలాగే, మోతే శివారులోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఎంపీవో మహ్మద్ సలీమ్ స